క్లుప్తంగా

గణాంక శాస్త్రంపై అవగాహన

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణాంక శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా గణాంక విభాగ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ హాజరై గణాంకశాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ఉండే ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో వాటిపాత్రను వివరించారు. గణాంక శాస్త్ర విభాగం ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించే విధానాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు జ్యోతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రొయ్యల పెంపకంలో శిక్షణ



రొయ్యల సాగుపై శిక్షణ పొందిన యువకులు

బాలాజీచెరువు: ముంబాయిలోని కేంద్రీయ మత్స్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ మత్స్యకార శిక్షణ కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై రొయ్యల పెంపకం అంశంపై శిక్షణ ఇచ్చారు. షెడ్యూల్ కులాలకు చెందిన యువకులు, రైతులకు పదిరోజుల పాటు శిక్షణ ఇచ్చి బుధవారం ముగించారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎస్‌సీఎస్‌పీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించగా కేంద్ర మత్స్య శిక్షణ సంస్థ డైరెక్టర్, వీసీ డాక్టర్ సీఎస్ రవిశంకర్ సర్టిఫికెట్లు అందజేశారు. నోడల్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ మురళీధర్ అందే, సైంటిస్ట్ శ్యామల, పి.శ్రీనివాసరావు, ఉషారాణి పాల్గొన్నారు.

లేపాక్షిలో విక్రయాలపై డిస్కౌంట్



ప్రదర్శన, విక్రయాలకు పెట్టిన హస్తకళా వస్తువులు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని లేపాక్షి షోరూమ్‌లో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువుల కొనుగోలుపై 10 నుంచి 40 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు లేపాక్షి మేనేజర్ సీహెచ్ వీరబాబు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలు, లెదర్ ల్యాంప్స్, బంజారా, లెదర్‌వేర్, కార్పెట్లు, కళంకారీ బెడ్‌షీట్లు, కళంకారీ శారీస్, బ్లాక్‌మెటల్ క్రాఫ్ట్స్, శహరాన్‌పూర్ ఉడ్ కార్వింగ్ ఈ డిస్కౌంట్ సేల్స్‌లో లభిస్తాయన్నారు. ఈ అవకాశం 31 వరకూ మాత్రమే ఉందన్నారు.

జనరల్ సర్జరీలో మెహర్ సత్తా



మెహర్‌కు పట్టా అందిస్తున్న డీన్ ఆనంద్ ఆచార్య

అమలాపురం రూరల్: కిమ్స్ కళాశాలలో వైద్య వృత్తిలో పట్టా పొందిన కాకినాడకు చెందిన అద్దంకి మెహర్ హరి జగన్మోహన్ సర్జరీ విభాగంలో డిస్టింక్షన్ సాధించి అరుదైన ఘనత సాధించాడు. ఏకంగా 75శాతం మార్కులు సాధించి కళాశాలలోనే సర్జరీ విభాగంలో టాపర్‌గా నిలిచాడు. ఓవరాల్ సబ్జెక్టుకు 65 శాతం భారీగా ఉత్తీర్ణత సాధించిన మెహర్ సర్జరీ విభాగంలో కళాశాలనే టాపర్‌గా నిలిచాడు. కళాశాల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ రవికిరణ్ వర్మ, డీన్ ఆనంద్ ఆచార్య, ప్రొఫెసర్ గోలకోటి రంగారావు డాక్టర్ మెహర్‌ను అభినందించారు. మంగళవారం జరిగిన కళాశాల స్నాతకోత్సవంలో తల్లిదండ్రులు అద్దంకి ముక్తేశ్వరావు నాగరాణి దంపతులు సమక్షంలో మెహర్ ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాడు.

నేడు పొట్టి శ్రీరాములు జయంతి

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఉదయం 10 గంటలకు సీబీఎం స్కూల్ రోడ్డు కూడలిలో నిర్వహించనున్నారు. జేసీ ఎస్.ఇలక్కియ పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈమెతో పాటు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నివాళులర్పించనున్నారు.

జీజీహెచ్‌లో వర్క్‌షాప్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కార్యశాల జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో పీజీ విద్యార్థులతో శస్త్రచికిత్స నిర్వహణ, తదితర అంశాలపై స్వీయ సాధన చేయించారు. ఆస్పత్రి అధికారులు, సర్జరీ విభాగం బృందం పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం వలసపాకల గ్రామంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ, వి.ఆంజనేయులు, చాట్ర ఇమ్మాన్యుయేలు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజే ట్రాఫిక్ పరీక్ష

- ఆందోళన చెందిన ఇంటర్ విద్యార్థులు
- మోహన్ కళాశాల వద్ద అర్ధగంట పాటు అవస్థ
- పరీక్ష కేంద్రానికి వెళ్లే దారిలోని పాఠశాలల బస్సులు నిలిపివేయాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



కాకినాడ రూరల్ రమణయ్యపేట మోహన్ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

కాకినాడ రూరల్: ఇంటర్ విద్యార్థులు తొలిరోజు ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కుని ఇబ్బంది పడ్డారు. రాత్రంతా పుస్తకాలతో బట్టీ పట్టి పరీక్షా కేంద్రానికి గంట ముందే ఎంతో ఆతృతగా వచ్చిన విద్యార్థులు రమణయ్యపేట ఈశ్వర్‌నగర్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రమణయ్యపేట పరిధిలో మోహన్, స్వామి జూనియర్ కళాశాలతో పాటు ఇంద్రపాలెంలోని శాంతి నికేతన్ జూనియర్ కళాశాలను సెంటర్లుగా ఏర్పాటు చేశారు. కాకినాడ–పిఠాపురం రోడ్డును ఆనుకుని ఏపీఎస్పీ గేటు పక్కగా ఈశ్వర్‌నగర్‌లో మోహన్ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఉదయం 8.10 గంటల నుంచి అరగంటకు పైగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఇంటర్ విద్యార్థులు, వారిని తీసుకువచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లకు తోడు మోహన్ కాన్వెంట్, హైస్కూల్ పిల్లలతో వచ్చే స్కూల్ బస్సులు ఒకేసారి రావడంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాలకు పరుగులు తీయవల్సి వచ్చింది. ఈ క్రమంలో కొందరు తీవ్ర ఆందోళన చెందారు. పరీక్షా కేంద్రం వద్ద ఉన్న పోలీసులు ట్రాఫిక్ నియంత్రించలేకపోయారు. చివర్లో పోలీసు వచ్చినప్పటికీ అప్పటికే వాహనాలు బార్లులా నిలిచిపోవడంతో సమస్య తప్పలేదు. సర్పవరం పోలీసులు ముందుగానే ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి ఉంటే విద్యార్థులకు ఇబ్బందులు తప్పేవి. ఇంటర్ విద్యార్థులు పరీక్షా సమయానికి చేరుకునేందుకు వీలుగా ఈశ్వర్‌నగర్‌లో మోహన్‌కాన్వెంట్ రోడ్డులో స్కూల్ బస్సులను నిలిపివేస్తే బాగుండేదని, లేకుంటే పరీక్షలు పూర్తయ్యే వరకు ఇదే సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తొలిరోజు 21మంది విద్యార్థుల గైర్హాజరు

కాకినాడ రూరల్ మూడు సెంటర్లలో తొలి రోజు 21 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. తొలి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు/సంస్కృతం పరీక్ష జరిగింది. శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో 291మంది విద్యార్థులకు 284 మంది హాజరయ్యారు. ఏడుగురు హాజరుకాలేదు. స్వామి జూనియర్ కళాశాలలో 321 మంది విద్యార్థులకు 317మంది హాజరుకాగా నలుగురు హాజరుకాలేదు. మోహన్ జూనియర్ కళాశాలలో 533 మంది విద్యార్థులకు 523మంది హాజరయ్యారు.

కరప మండలంలో..

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా మొదటిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కళాశాలలో ప్రథమ సంవత్సరం 130 మందికి ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు కాగా, 123 మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.ధనకృష్ణారావు, డిపార్ట్‌మెంటల్ అధికారి జెస్సీ డేనియల్, ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఎస్ఐ నౌడు రామకృష్ణ సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాల్లో..

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ విభాగంలో తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలను 19,377 మందికి 18,714 మంది రాయగా ఒకేషనల్ విభాగంలో ఫౌండేషన్ పరీక్ష 1475కు 1378 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్ష కావడంలో పరీక్ష కేంద్రం వద్దకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో చేరుకున్నారు. పిఠాపురం రెండు, కాకినాడ రెండు, పెద్దాపురం ఒక కేంద్రాన్ని డీవీఈవో జీకే నూకరాజు పర్యవేక్షించారు.



ట్రాఫిక్‌లో చిక్కుకుని పరీక్షా కేంద్రానికి నడచి వెళ్తున్న విద్యార్థినులు



వేళంగి పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ తదితరులు



వేళంగిలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా వైడీఆర్



రామారావు

కాకినాడ: దక్షిణ మధ్య రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యునిగా వైడీ రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి దివంగత ఎస్ఎస్ కృష్ణాజీ సారథ్యంలో 1959లో స్థాపించిన రైల్వే ప్రయాణికుల సంఘం తరపున ఆయనకు ఈ ప్రాతినిధ్యం కల్పించారు. కాకినాడ, జిల్లా ప్రయాణికుల సంఘ అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. దాదాపు దశాబ్దకాలంగా ఆయన జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా, డీఆర్‌యూసీసీ సభ్యుడిగా ఈ పదవిలో కొనసాగుతూ రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. కాకినాడ–విశాఖ పాసింజర్‌లో టాయ్‌లెట్ సదుపాయంకల్పించడం నుంచి, కాకినాడ –సామర్లకోట రైల్వే స్టేషన్లలో లిఫ్ట్ సదుపాయాలు, సామర్లకోటలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కాకినాడ–ముంబాయి రైలు సాధన వంటి అనేక అంశాల సాధనలో ఆయన కృషి చేశారు. ప్రతి రైల్వేబోర్డు సమావేశంలోను జిల్లాకు సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్తా రైలు మార్గం, కొవ్వూరు–సత్తుపల్లి రైలు మార్గం, ప్రస్తుతం ఉన్న రైళ్లకు అదనపు భోగీల ఏర్పాటు, నూతన రైళ్లను ప్రవేశపెట్టడం, సామర్లకోటలో సూపర్‌ఫాస్ట్ రైలు నిలుపుదల వంటి అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనను జెడ్ఆర్‌యూసీసీ సభ్యునిగా కొనసాగించిన రైల్వే అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సీటీ స్కానర్‌పై సత్వర చర్యలు తీసుకోండి

- రెండు వారాలుగా ఇబ్బందులు పడుతున్న రోగులు
- కలెక్టర్ ఆదేశాలతో కదలిన జీజీహెచ్ యంత్రాంగం
- నిర్వహణ సంస్థ ఎస్ఎల్ డయోగ్నోస్టిక్స్‌పై రేడియాలజీ విభాగం హెచ్ఓడీ ఆగ్రహం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో సీటీ స్కాన్ రెండు వారాలుగా పనిచేయడం లేదు. దీంతో రోగులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం 120 నుంచి 150 స్కానింగులు తీసే ఈ పరికరం పనిచేయని విషయం అధికారులకు చేరింది. సీటీ స్కాన్‌ను ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్ సంస్థ నిర్వహిస్తుంది. ఎంవోయూను అనుసరించి ఏ సందర్భంలోనైనా స్కానర్ పనిచేయకపోతే సంస్థే రోగుల కోసం తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. స్థానికంగా ఉన్న స్కాన్ సెంటర్లకు సొంత అంబులెన్సులో రోగిని తరలించి అక్కడ స్కాన్ నిర్వహించి తిరిగి రోగిని జీజీహెచ్‌కు చేర్చాలి. ఆ సంస్థ ఎంవోయూ సమయంలో నగరంలోని సత్యా స్కాన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని కావడంతో వారు మౌనం వహిస్తున్నారు. స్కానర్‌లో ట్యూబ్ పాడయింది, బయట చేయించుకోండంటూ రోగిని వెనక్కి పంపేస్తున్నారు. ఈ విషయం నేరుగా కలెక్టర్ కృతిక శుక్లకు చేరింది. ఆమె జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవితో పాటు రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనురాధను వివరణ కోరారు. ఈ నేపథ్యంలో సీరియస్ అయిన హెచ్‌వోడీ డాక్టర్ అనురాధ సూపరింటెండెంట్ ఆదేశాలతో ఎస్ఎల్ డయాగ్నస్టిక్స్ స్థానిక ప్రతినిధులతో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మందలించారు. సత్వర చర్యలు తీసుకోకుంటే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.



జీజీహెచ్‌లో నిరుపయోగంగా ఉన్న సీటీ స్కానర్



ఏడీసీ నాగనరసింహారావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చేసిన సేవలకు గుర్తింపు

- ఏడీసీ నాగనరసింహారావు
- సత్కరించిన ఉద్యోగుల సంఘం

కాకినాడ: విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. పుర పరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నాగనరసింహారావును మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వివిధ విభాగాధిపతులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనను సన్మానించారు. నాగ నరసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్ల సర్వీసులో ప్రతి ప్రాంతంలోను ఉద్యోగుల సహకారంతో సంతృప్తికరమైన సేవలు అందించానన్నారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని ఇవ్వగలినప్పుడే ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చగలమని, ఉద్యోగులంతా ఆ దిశగా పనిచేయాలని సూచించారు. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి జాన్‌పాల్, కోశాధికారి సత్తెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువ ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణ పనులను నిలిపివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామ పరిధిలోని గంగరాజునగర్–4 రోడ్డు వినాయకుడి ఆలయం వెనుక పీడబ్ల్యూడీ కాలువ స్థలం ఆక్రమణకు పలువురు ప్రయత్నించగా గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. విలువైన కాలువ స్థలంలో జేసీబీతో మట్టి చదును చేస్తుండగా పంచాయతీ కార్యదర్శి బీబీ, వీఆర్వో చిన్న తదితరులు పనులు నిలిపివేశారు. తహసీల్దార్ మురార్జీ బుధవారం రాత్రి విలేకర్ల ప్రకటనలో వలసపాకల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 158/2లో ఉన్న భూమిని కొందరు ఆక్రమిస్తుండగా రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ప్రభుత్వానికి చెందిన కాలువ భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పద్మాలయలో గణా చిత్ర ఆవిష్కరణ

- 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల



గణా చిత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో విజయ్‌కృష్ణ, ఎన్.బుచ్చిరెడ్డి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక మెయిన్‌రోడ్డులోని పద్మాలయ స్టూడియోలో యువ నటుడు విజయ్ కృష్ణ నటించిన గణా చిత్ర బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ్‌కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. ఈనెల 17న ప్రపంచవ్యాప్తంగా 400 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. నాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాకినాడకు చెందిన ఎంతో మంది చిత్ర పరిశ్రమలోకి వెళ్లి ఖ్యాతి గడించారన్నారు. అందువల్లనే కాకినాడలో ఈ చిత్ర ముందస్తు వేడుక చేస్తున్నామని అన్నారు. చిత్ర హీరో విజయ్‌కృష్ణ స్వయంగా కథ తయారు చేసుకుని స్వీయ దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మించారని నిర్మాతలు సాయి కృష్ణారెడ్డి, ఎస్.బుచ్చిరెడ్డి, బాలప్రసాద్‌లు అన్నారు. ఎక్కడా డూప్ లేకుండా రిస్క్ తీసుకుని ఆయన నటించారని తెలిపారు. మూడున్నర కోట్ల రూపాయలతో ఎంతో నాణ్యత ప్రమాణాలతో చిత్రాన్ని నిర్మించామని, హీరోయిన్లు సుకన్య, తేజులు మంచిగా నటించారన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రం సాగుతుందని అన్నారు. ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించాలనీ కోరారు. చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. మంచి ఉత్తీర్ణత సాధించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్: విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి గొడారిగుంట హైస్కూల్‌ను బుధవారం తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. అనంతరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి అందరి ఫొటోలు ఫ్లెక్సీలో చూడాలని పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. పాఠశాల హెచ్ఎం వై.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై ప్రజాసంఘాల పోరు

- ఘనంగా మహిళా దినోత్సవం
- సాధికారత సాధిద్దామని నినాదం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న వివిధ సంఘాల మహిళా ప్రతినిధులు

కాకినాడ సిటీ: శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సుందరయ్య భవన్ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. సీఐటీయూ, శ్రామిక, మహిళ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని నినదించారు. బాలికలు, వృద్ధులు అనే తేడా లేకుండా మహిళలపై అత్యాచారాలు, హింస జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు రాజ్యాసభ ఆమోదం పొంది నేటికీ లోక్‌సభలోకి రాలేదన్నారు. విద్యా ఉపాధి కల్పన ద్వారా మహిళా సాధికారత సాధించి, సామాజిక రాజకీయ రంగాల్లో సమానత్వ దిశగా సాగాలన్నారు. ఇందుకోసం ఐక్య పోరాటాలు అవసరమన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు దడాల పద్మ, జి.బేబీరాణి, సీహెచ్ రమణి, కె.దుర్గాదేవి, కె.నాగజ్యోతి, ఈ చంద్రావతి, ఎస్.ఈశ్వరి, రమణమ్మ, రాజేశ్వరి తదితరులు మాట్లాడారు. అనంతరం సుందరయ్య భవన్ నుంచి మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రామిక మహిళా సంఘాల నాయకులు టి.నాగమణి, ధనలక్ష్మి, దాడి బేబి, అమలావతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించండి

- కమిషనర్ రమేష్

కాకినాడ: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన కాకినాడ ఇందిరా కాలనీ, సాంబమూర్తి నగర్, రాగంపేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్మికుల మస్టర్లను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త సేకరణ, విభజించి ఇస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, కార్మికులకు పలు సూచనలిచ్చారు. సకాలంలో విధులకు హాజరై మెరుగైన పనితీరుతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఈ విషయంలో ఎక్కడైనా లోపాలుంటే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా తడిపొడి చెత్తను వేర్వేరుగానే ఇవ్వాలని, రోడ్లుపైన, డ్రైన్లలోను వేయవద్దని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు టి.ప్రసాద్, కె.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వినియోగదారుల చట్టాన్ని తెలుసుకోవాలి

కాకినాడ: వస్తు సేవల్లో లోపానికి పరిహారం పొందేలా వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకోవాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం వినియోగదారుల హక్కు అని పేర్కొన్నారు. అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

హక్కులు సద్వినియోగం చేసుకోవాలి

బాలాజీచెరువు: వస్తు సేవల్లో నష్టం కలిగితే వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగంచేసుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంతకుమార్ పేర్కొన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. వసంత కుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతిరోజూ ఏదో వస్తువు కనుగోలు చేస్తామని, నాణ్యత, సేవలు తదితర వాటిలో లోపం వస్తే ఈ ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అనంతరం వినియోగదారుల ఫోరం విధి విధానాలు వివరించారు. సభ్యులు చక్కా సుశి, చాగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జగన్నాథపురం జె.రామారావుపేటకు చెందిన రేవాడి లోవరాజు వార్ఫురోడ్డులో చేపల మందుతాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతనిని జీజీహెచ్‌లో చేర్చారు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

తనపై పొరుగింటి వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ కాకినాడ జగన్నాథపురం నాగరాజుపేటకు చెందిన మహిళ వీరబాబు అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.రామ్మోహన్ తెలిపారు. ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం , వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22వ తేదీ లోపు స్థానిక మెప్మా కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని అన్నారు. విజేతలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున అవార్డులు అందజేస్తామన్నారు.

మంత్రిప్రగడవారి సత్రం, దేవదాయ ధర్మదాయ శాఖ

టెండరు ప్రకటన

[illegible]

క్ర.సం.	సరుకు వివరం	ధరావత్తు సొమ్ము	టెండరు షెడ్యూల్	కాలపరిమితి
1	కిరాణా సామాగ్రి సప్లై	రూ. 10,000/-	200/-	01-04-2023 నుండి 31-03-20[illegible]
2	కూరగాయలు	రూ. 8,000/-	200/-	-do-
3	పెరుగు	రూ. 8,000/-	200/-	-do-

ముఖ్యషరతులు : [illegible]

కాకినాడ
తేది : 15-03-2023

కె.సుబ్రహ్మణ్యం
కార్యనిర్వహణాధికారి